

# రాలిన నక్షత్రం!

- అరుణ నిష్ఠల

అద్దాల కిటికీకి ఉన్న సిల్క్ తెర ఒత్తిగించి చూసాను. నగరం రాత్రి దీపాల కాంతిలో అందంగా పైన చీకటి గొడుగేసుకుని తన ప్రజలందరినీ 'నిద్రపొండి హాయిగా' అని ఆశీర్వదించి నిద్రపుచ్చినట్లు వుంది. మధ్య రాత్రి దాటుతోంది. ఆ అందం కొంచెం తెల్లవారితే చాలు, మురికి వీథులతో ఎగుడు దిగుడు ప్రదేశాలతో స్లమ్ ఏరియాలతో మధ్య తరగతి విలాపాలతో ఉన్నత వర్గపు విలాసాలతో నగరం ఎంత వికృతమైనదో తెలుస్తుంది. మేకప్ వేసుకున్నట్లుగా చీకటి కప్పుకున్న నగరం అంటే భయంవేసినట్లు చప్పున తెర వేశాను.

సీలింగ్‌కి ఫోకస్ చేసిన లైట్లు మందమైన కాంతిని గదంతా నింపుతున్నాయి. నా చూపు టిక్ టిక్ మంటూ ఎవరో తరుముకొస్తున్నట్లు పరిగెడుతున్న సెకండ్ల ముల్లు వైపు తిరిగింది. ఈ కాలానికి హృదయంలేదు. ఆగదు ఇది ఉరుకులు పరుగులు పెట్టి మనిషికి ఆపాదించిన దేమిటి? ఆయువు ఉంటే అనుభూతి వలయాలు, ముడతల శరీరం వయస్సులేని మాసిపోని మనస్సు... బంగారపు గిల్టుగల ఆఫ్రేము అద్దమూ నా చేతివేళ్ళు గడియారపు ముళ్ళని తాక నివ్వకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఆపక్కనే యాంటిక్ అద్దంలో నా ప్రతిబింబం కనిపించింది తల తిప్పగానే! ఈ అద్దం తీసేయాలి ఇక్కడినుంచి అనుకుంటూనే ఉన్నా కానీ నా ప్రతిబింబాన్ని చూడటం మానలేదు. రంగువేసుకున్న జుట్టు! నల్లగా భుజాలదాకా ఉంగరాలు తిరిగిన ఒకప్పటి ఆ ఒత్తు ఏదీ? కళ్ళు విశాలంగా పెద్ద కనుపాపలతో... 'అసలు మీ గ్లామరు అంతా మీ కళ్ళలో ఉంది. నెమ్మదిగా తలతిప్పి చూసే ఆకళల్లో నక్షత్రాలు అన్నీ ఆకాశంలో మాయమై మీ కళ్ళలో,' సురేష్ మాటలు... సొగదేలిన ముక్కు ఇదివరకటిలా లేదు. ఏమిటా మార్పు? లిప్‌స్టిక్ వేసి వేసి నల్లబడిపోయిన నా పెదవులు రంగులేకపోతే నేనే చూడలేకపోతున్నాను, ఎన్ని లేపనాలు రాసిన ఎంత హెర్బల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినా ఫేస్ లిఫ్ట్ చేయించుకున్నా ఈ కళ్ళక్రింద చారికలు ఏమిటో? కడుపును హింసించి నాలుకను అదుపుతో ఉంచుకోవటంతో శరీరాకృతి కొంచెం ఫర్వాలేదు అయినా ఏదో మార్పు... డామిట్... అద్దానికున్న లేస్ కర్టన్ కసిగా లాగాను. నా కోపానికి భయపడినట్లు నా ప్రతిబింబం లేసు అల్లిక వెనక్కాల దాక్కుంది.

ఆ పక్కనే ఉన్న టేబుల్ మీద నా బ్లాక్ అండ్ వైట్ ఛాయాచిత్రం. హీరోయిన్‌గా నేను! చూస్తూండగానే నా పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. ఆ పక్కనే ఏ హీరోకీ లేనటువంటి అందంతో సురేష్ చిత్రం. ఒకప్పుడు నాకు కెమెరా ఒక్కటే ప్రపంచం. వద్దనుకుంటూనే పత్రికల పొగడ్తలు వందసార్లు చదువుకున్నా ఇంకా ఏదో వెలితి అనిపించేది. చిన్నపుడు ఐశ్వర్యవంతుల్ని చూసి పడ్డ ఈర్ష్యకి దేవునికి జాలి కలిగిందేమో! అంతులేని సంపద ఇప్పుడు! నా సర్వమూ బాధ్యతగా చూసే సురేష్. ఉన్నత విద్య చేతిలో ఉంది. మంచి ఉద్యోగం చూసాను. సురేష్ నిజాయితీపరుడు. నాకు ఇంత మంచి పేరు రాక ముందునుంచే పియేగా పనిచేసేవాడు. నా వంతు సహాయం అతనికి చెయ్యాలనిపించి మంచి కంపెనీలో బ్రాంచి మేనేజరు పోస్ట్‌కి సిఫారస్ చేసి వెళ్ళమన్నాను. వెంటనే నాకళ్ళలోకి చూస్తూ 'ఒన్ మినిట్' అంటూ గార్డెన్‌లోకి వెళ్ళి ఒక గులాబిని తెంపి తెచ్చి నాకిస్తూ "విల్ యూ మేరీ మీ" అని అడిగాడు. ఒక్కక్షణం స్టన్ అయిపోయాను. ఆశ్చర్యంగా అడిగాను "అంటే".

"సింపుల్! సిన్స్ ఐ లవ్ యూ ఈ పని వదిలేసి వెళ్ళను. నా ప్రశ్నకి జవాబుగా అవునంటే నేను వెళ్తాను". పేపర్లు చూసుకుంటూ వచ్చిన టెలిఫోన్ అటెండ్ అవుతూ అతి నార్మల్‌గా ప్రవర్తిస్తున్న సురేష్ అంటే ముచ్చట కలిగింది నేను కెరీర్ బాగా వృద్ధిపరచుకోవాలి మంచి ఉన్నత స్థితికి వెళ్ళిపోవాలని ఆశించాను తప్ప ఎప్పుడూ పెళ్ళి గురించి ఆలోచించనేలేదు.

నేను నిజంగా పెళ్ళి చేసుకోవాలనుకుంటే సురేష్‌కి మించిన వరుడు నాకు దొరకడని అనిపించింది. ఇన్నాళ్ళుగా నేను అతడిని ఎరుగుదును. ఒక వ్యక్తి ఇంతకంటే సంస్కారంగా, మానసికంగా ఉన్నతంగా ప్రవర్తనలో మంచిగా ఉండడని అనుకుంటూ ఉండేదాన్ని. అంతవరకే నా ఆలోచన. కాని ఇప్పుడు ఒక కొత్త అధ్యాయం! ఆ ప్రశ్న కెరటంలా ముందు ముంచెత్తింది కాని అర్థం అయ్యాక చిరునవ్వుతో "ఒ.కే. నా జవాబు అవును" అన్నాను.

"థాంక్యూ వెరీమచ్, కానీ రెండేళ్ళు టైమ్ తీసుకుందాం!" అన్నాడు. మళ్ళీఫోను మ్రోగింది.. ఎవరితోనో అతి మృదువుగా నాగురించి నా టైమ్ గురించి డేట్స్ చర్చిస్తున్నాడు, డైరీ వెరిఫై చేస్తూ. నా నిర్ణయం సరైనదే అనుకున్నాను.


ఆ రెండేళ్ళూ సురేష్ మాట మన్నించి నేను చాలా తప్పు చేసాననిపించింది. పెళ్ళయిన ఏడాది కూడా కాలేదు బామ్మకి ఒంట్లో బాగాలేదంటే తీసుకురావడానికి వెళ్ళిన సురేష్ మళ్ళీరాలేదు. వాళ్ళు వస్తున్న కారుని పెద్దలారీ... చప్పున కళ్ళు మూసుకున్నాను. ఎదురుగుండా వున్న చిత్రం మాయమైంది. అంతర్నేత్రంతో సురేష్ నవ్వుముఖం చూస్తున్నాను. గాఢంగా నిట్టూర్చి లేచాను. నా అడుగులు అప్రయత్నంగా మధు గదివైపుగా పడ్డాయి. మధు కళ్ళలో సురేష్ కళ్ళపోలిక ఉంది. తనలో సురేష్‌ని చూడాలనిపించింది.

కాని మధు ఆదమరచి నిద్రపోతోంది. వారసత్వంగా సంక్రమించిన అందం, 'మధుబాల' అంటే అభిమానం కొద్దీ ఆమె పేరు పెట్టినా "ఐ హేట్ మైనేమ్" విసుగ్గా కళ్ళు చిట్లించి ఆపేరెందుకు పెట్టారన్నట్లు చూసే మధు చూపులు... ఏం జనరేషన్? ఎంత చికాకు? ఎంత విసుగు? ఆలస్యం భరించలేరు! అన్నీ ఇన్‌స్టెంట్ కాఫీలా జీవితంలో చప్పున అమరిపోవాలి. నటి, పాత్రలు, సినిమా, డబ్బు, ఫేమ్ అనే పదాలు మధు నోటి నుంచి తరచు వెలువడుతున్నాయి. నేను ఎంకరేజ్ చేయదలచుకోలేదు. సినిమాఫీల్డ్, అదొక ఊబి! బాగా చదువుకుంటే పెద్ద డాక్టరో, సైంటిస్టో.....

"మమ్మీ డాడీ ఏ ప్రొఫెషన్‌లో ఉంటారో అందులో పిల్లలకి సాధారణంగా ఇంట్రెస్ట్ ఉంటుంది" మధు పెంకె సమాధానం నా ఆశల మేఘాల్ని తుఫానుగాలిలా తుత్తినియలు చేస్తున్నది. భయం. దేన్నుంచి తప్పించుకుందామనుకుంటున్నానో దాని దగ్గరకే వచ్చాను. భయంగా నా గదిలోకి వచ్చాను. ఇంతకీ ఎందుకీ భయం? మనశ్శాంతి లేకపోవడం?

"ఎందుకంటే" అంటూ నా మనస్సు పెద్ద వేదాంతిలా ఏదో చెప్పబోతూంటే వెంటనే పీక నొక్కేసాను. నిజానికి నాకు సమాధానం తెలుసుకాని ఒప్పుకోవాలంటేనే ఇష్టంలేదు. బ్లాంకెట్ మెడవరకూ కప్పుకుంటూ మంచం మీద కూర్చున్నాను. నిద్రపోవాలి. వాస్తవాన్నించి

Vemakoti Seeta Rama Sastry
WRITER APSEB J.E.O (Field)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM



తప్పించుకోగలనా? నా నీడలా నన్ను బెదిరించే వర్తమానం భవిష్యత్‌ని కాన్‌వెక్సు మిర్రర్‌లో చూపెడుతోంది. నేను తల్లివేషాలు వెయ్యను. ఎపుడో నిర్ణయం తీసుకున్నాను. ఎవరడగనీ నెవర్! మళ్ళీ మళ్ళీ మనసుకు చెబుతూంటే తృప్తిగా అనిపించినా ఎక్కడో విన్న పాట మనసులోంచి నినదిస్తోంది. "లుక్ ఎట్ హర్ నౌ! ద గోల్డెన్ డేస్ ఆర్ ఓవర్ ! ఓవర్!"

* * * *

"మేడమ్! గంగాధరంగారొచ్చారు" సీమ చెబుతోంది. చేతిలోని భగవద్గీతలో బుక్ మార్క్ పెట్టుకుని లేచాను. నిజానికి నేను ఎవరినీ కలవదలచుకోలేదు. కానీ గంగాధరంగారు నాతండ్రి లాంటివారు. అసలు ఆయన వలనే నేను వెలుగులోకి వచ్చింది." నటనకీ వయస్సుకీ నిమిత్తం లేదు తల్లీ!" అంటారాయన ఎప్పుడూ. ఆయన కరెక్టు! కానీ నా భయాలు నాకున్నాయి. ఏతల్లి వేషమో వేయమంటారు? ఐ హేట్ ఇట్.

"మధు విషయం చర్చించాలని" సీమ చెబుతోంది.

నేను భయపడినంతా అయింది. అందుకే వేరే ఊర్లో చదివిద్దాం అనుకున్నా తను ఒప్పుకోందే! పంతొమ్మిదేళ్ళ మధుబాల కోసం సినిమా జనం వల వేస్తారని నాకు ముందే తెలుసు. బి.యస్సీ రెండో ఏడు. చదువు తక్కువా పార్టీలు ఎక్కువ. పిక్‌నిక్‌లు డిస్కోతిక్‌లు లైఫ్ ఎంజాయ్ చెయ్యాలట. పిచ్చిపిల్ల. లైఫ్ తనని ఎంజాయ్ చేస్తోందని తెలుసుకోలేకపోయింది. ఎమ్.బి.బి.యస్ సీటు కొనగలను కానీ చదువు... ఆగిపోయాను.

గంగాధరంగారితో 'మధు సినిమాలలో వెయ్యదు. చదువుకుంటోంది' అని చెప్పాను. ఆయన నాతల్లి వేషం గురించి ఎక్కడ ప్రస్తావిస్తారో అని భయపడ్డాను. కానీ ఆయన అడగలేదు.

* * * *

ఆ సాయంత్రం పెద్ద తుఫాను చెలరేగింది "నా మాటగా నా నిర్ణయం చెప్పే హక్కు నీకెవరిచ్చారు? ఆయనతో అదివరకు చెప్పాను నటిస్తానని. నేను వేయనని, చదువుకుంటానని ఎలా చెప్పావు? వాట్ డూ యూ మీన్? నువ్వే అందాల నటివా? నీకే పేరుండాలా? నాకందం లేదా" ఇంకా ఏమిటేమిటో అందిగాని నాకు కత్తిలాంటి ఆరెండు ప్రశ్నలూ వినగానే గుండె చీరుకుపోయింది. ఇన్నాళ్ల నాపెంపకంలో నాకూతురికి నేర్పిన సంస్కారం ఇదా? ఇంకా నయం సురేష్ లేడు గనక సరిపోయింది. సభ్యతలేని ఈమాటలు విని ఏమైపోయేవాడో? తల్లిప్రేమ ఎరుగని నేను నాబిడ్డకు నావృత్తి ఎటువంటి అవరోధం కలిగించకూడదని ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పెంచుకున్నాను నా చిట్టి మధుని! ఒక్కసారి ఇంతవరకు బంధించి ఉన్న శృంఖలాలు తెగిపోయినట్లు అయింది. అప్పుడే ఒక దృఢ నిశ్చయానికి వచ్చాను.

'నువ్వేనా అందాల నటివి? నీకే పేరుండాలా'. అందం నా ఒక్కదాని సొత్తు కాదని నాకు తెలుసు. అందం మాసిపోతోందని అదివరకు బాధపడ్డా ఆ ఊహ తప్పు అని గ్రహించాను. ఈ ప్రపంచం నిండా అందగత్తెలున్నారు. ప్రకృతిలో ఈ అందానికి ఒక రకమైన ప్రతినిధులం మేమే. నా డ్యూటీ అయిపోయాక నేను విశ్రమిస్తే మరో ప్రతినిధి శ్రమించవచ్చును. ఇదో ప్రవాహం. ఈ ఆలోచన రాగానే అంతవరకూ నేను పడ్డ మనోవేదన అర్థం లేనిదిగా అనిపించింది. ఆతరవాత నాదృక్పథం మారింది. ముఖ్యమైన విషయాలు, ఆస్తి పాస్తులు మధుకెంత ఇవ్వాలో ఛారిటీ ఇన్‌స్టిట్యూషన్‌కి ఎంత ఇవ్వాలో నిర్ణయించాను. సీమకు కొన్ని బాధ్యతలు అప్పచెప్పాను. పెళ్ళి అయినాక సురేష్‌కి మేనేజర్ పోస్ట్ గురించి జ్ఞాపకం చేసాను. తను నవ్వేసి 'ఈపోస్టులోంచి తీసేయకండి మేడమ్' అంటూ దీనంగా నాటకీయంగా అంటుంటే నేను నవ్వేసాను. పెళ్ళి అయినా సురేష్ పియేగానే వ్యవహరించాడు. అతడి జాగాలో అతడి పినతల్లి కూతురు సీమ పనిచేయ మొదలిడింది. సీమ కూడా సురేష్‌లాగే చాలా మంచి మనిషి. కాస్త బంధుత్వం కూడా కలవడం వల్ల సీమ చాలా చనువుగా ఉంటుంది. మధు బాధ్యత తనదే అంటూ అప్పగించి బయలు దేరాను.

కొత్త ప్రదేశం. కొండలు ప్రకృతి అందం పుష్కలంగా ఉన్న ఋషికేష్‌లో ఫ్లాటు తీసుకున్నాను. మధు పెద్దగా బాధపడినట్లు నాకు కనిపించలేదు. స్వేచ్ఛ లభించిందని మనసులో సంబరపడిందేమో నాకు తెలియదు. ఋషికేష్‌లో వున్నా ఎక్కడ ఉన్నా మనస్సు తనమీదే. పత్రికలు చూస్తూనే ఉన్నాను. దాదాపు పదేళ్ళ క్రితందాక పత్రికలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాపేరు మళ్లీ ఎక్కింది మధు ధర్మమా అని.

సినిమా పేరు సౌదామినిగా మార్చేరుట. మధు నటించే మొదటి సినిమా భారీ ఎత్తున తీస్తున్నారు. మధు గురించి పత్రికలు డిబేట్ వేసుకున్నాయి. ఊహకి వచ్చినవి వ్రాస్తున్నాయి. సగం నిజం, సగం అబద్ధమూ కలసిన ఆ మసాలా విషయాలు ప్రజలకెంతవరకు కావాలో మరి!

పబ్లిసిటీ.. పబ్లిసిటీ.. మారోజులలో సినిమా విడుదల అయిందంటే ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రజల అభిప్రాయాలకు ఎదురు చూస్తూండేవాళ్ళం. ఎన్ని సినిమాల్లో వేసినా ఎంత సీనియర్స్ అయినా ఎంత పేరున్నాసరే అదే ఒరవడి. ఇప్పుడో, సినిమా విడుదల కాకుండానే పబ్లిసిటీ.. మధు సినిమా విడుదల అయింది.. ఎందుకో అన్నీ వదులుకొని సన్యసించానని నాకు నేను నచ్చ

చెప్పుకుంటున్నా ఏదో భయం నన్ను ఆవరిస్తోంది.

మధు సినిమా ఫెయిల్ అయింది. పత్రికల నిండా మధు యాక్టింగ్ నా నటనతో పోల్చుతూ రాసిన విమర్శలు. ఎంత మేకప్ వేసుకున్నా తల్లి అందం లేదనీ, నటనలో సహస్రాంతం పోలిక లేదనీ అన్ని భావాలకూ ఒకటే ఎక్స్‌ప్రెషన్ అనీ మధు హీరోయిన్ అయితే ప్రొడ్యూసర్లు నెత్తమీద కొంగు వేసుకోవాలని...

ఇలా అవుతుందని నేను కలలో కూడా ఊహించ లేదు. నేను భయపడినది వేరు. మధుని సినిమాలో నటించవద్దని ఎందుకు అన్నానంటే ఒక శిఖరం అంటూ చేరుకున్నాక ఇంకా పైకి వెళ్ళడానికి గమ్యం లేనపుడు అక్కడే ఆగిపోవడం లేదా తిరిగి రావడం నటిగా భరించలేని బాధ. ఎంతో అందమైన సినిమా నటిగా వెలుగొంది అందరి మనస్సులలో ఒక్కసారిగా నివసించ గలిగే అదృష్టం పొంది ఆఖరున ముది వయసు మీద పడతూంటే అది అంగీకరించక తప్పని పరిస్థితి బాధాకరమే! అందమైన ముఖం చూడటానికి అలవాటు పడిన జనం పాపం ఆరోజులలో ఎంత బాగుండేది ఎలా అయిపోయిందో అని కురిపించే జాలి చూస్తే గుండెలలో బాధ. వీటన్నింటి నుండి ప్రత్యక్ష నరకం నా పాప పడకూడదనే తను సినిమాలో నటిస్తానంటే నేను వద్దన్నది. చివరికి ఈ విధంగా మధుమీద గెలుపొందినా నిజమైన ఓటమి నాకే.

ఫోను మ్రోగింది. నాతోపాటే ఎంత వద్దన్నా వంట వండే శంకరయ్య వచ్చాడు. నన్ను ఇంచుమించు మనవరాలిగా చూసుకుంటాడు. వృద్ధాప్యం మీద పడినట్లుండదు. మంచి కసరత్తు చేసిన శరీరం. ఇల్లు వంట బాధ్యత అతనిదే. అమ్మాయ్ అని పిలిచేవాడు. మొదట్లో పాతికేళ్ళయినా లేని నన్ను, చెట్టంత మనిషి 'అమ్మగారూ' అని పిలిస్తే 'వద్దు అలా పిలవకు' అన్నాను.

"అమ్మాయ్! సీమ ఫోను చేసింది." బాల్కనీ నుండి కనుచీకటిలో వయ్యారంగా నిండుగా ప్రవహించే గంగని చూస్తున్న నేను లేచి వెళ్ళాను.

సీమ గొంతు వింటూనే నేను పసిగట్టాను చాలా బాధపడుతోంది, అది నాతో పంచుకోవాలని.. పిచ్చితల్లి వెంటనే రమ్మన్నాను ఫ్లాటుకి. సీమ వచ్చింది. అప్పుడే వచ్చిందిట ఋషీకేష్‌కు. మధు నెల్లాళ్ళు బయటకి రాలేదుట. చిక్కిపోయిందనీ నా కోసం బెంగపెట్టు కుందనీ చెప్పింది సీమ.

"సీమా! ప్లీజ్ టేక్ కేర్ ఆఫ్ హెర్ హెల్త్" నామాటలలో అభ్యర్థనకి సీమ నవ్వింది.

"మీరు ఈ మాట నాతో ప్రత్యేకంగా చెప్పక్కర లేదు మేడమ్. ఆమెకి ఇప్పుడు కావలసినది మీ హెల్ప్. మీ నీడ"

వింతగా చూసిన నా చూపుకి సీమ లేచి నిల్చుంటూ "ఆమెని మీరు క్షమించానని ఒక ముక్క చెప్పండి చాలు కోలుకుంటుంది. మీరు ఎస్ అంటే ఇప్పుడే తీసుకువస్తాను. తను నాతోనే వచ్చింది. హెూటల్‌లో ఉంది. అర్థం చేసుకున్నారనుకుంటాను" అంది.

సీమ మాటలకి విభ్రాంతి నుంచి తేరుకోవడానికి నాకు అట్టేసేపు పట్టలేదు. మధు సంగతి నాకు గాక బాగా ఎవరికి తెలుస్తుంది. సినిమా తెచ్చిపెట్టిన ఫెయిల్యూర్ తల్లిని చూసేందుకు కూడా మధుని జంకేలా చేసింది. 'థ్యాంక్ గాడ్! నా మొర ఇన్నాళ్ళకి విన్నావా'. మధు సినిమా ఫెయిలు అయినందుకు మొదటిసారిగా చాలా సంతోషించాను.

"పద సీమా నేనే వస్తాను" అన్నాను వెంటనే లేస్తూ. శంకరయ్య అప్పుడే లాల్చీ మార్చేసుకోవటానికి లోపలికి పరిగెత్తాడు. మధు అంటే పిచ్చి అభిమానం. వీలుకాలేదు గాని అక్కడో సగం ఇక్కడో సగంగా మా ఇద్దరి దగ్గరా ఉండేవాడేమో. కారులో బయల్దేరాం. బయట వచ్చే గంగానది గాలి చల్లగా చెవులకి సోకుతోంది. నా మధు పెద్ద చదువులు చదవాలి. పెద్ద సైంటిస్టో నోబెల్ ప్రైజ్ గ్రహీతో అయి పోవాలి. ఎక్కడో అణువంతగా అణిచేయబడ్డ నా కోరిక తిరిగి విశ్వరూపం ఎత్తి నా మనస్సు నిండా ఆక్ర మించేస్తోంది నెమ్మది నెమ్మదిగా పైకి చూసిన నాకు షూటింగ్ స్టార్ నాకంటపడింది. సన్నటి నవ్వు నా పెదవులపై కదిలింది. తారల జీవితమూ ఉల్కాపాతం లాంటిదే? ఒక్క వెలుగు వెలిగి అంతరించిపోతారు. ఆ వెలుగు మాసిపోయాక చీకటిని వారు భరించలేరు. ఆ చీకటిలో వారి ఉనికి ఎవరికీ అక్కరలేదు. వారి మనోవ్యథ అసలే పట్టించుకోరు ఎవరూ.

❑

